సుశీల

శ్రీమతి డి. యస్. రాజేశ్వరీ పట్నాయక్

జమాబందీ కాయితాలను చూచుకుంటున్న సుదర్శనానికి "యారోఓ ఆడదీ మొగోడు తమదరిసెనం కోసం వొచ్చేరు బాబయ్యా" అంటూ పాలికాపు వెంకాయ్ అతివినయంగా చెప్పేడు. "ఎవర్రా ఆ వచ్చేది? లోపలికి తీసుకురా" అన్నాడు సుదర్శనం. 'సిత్తం బాబూ' అని వెలుపలనున్న వ్యక్తులను యజమానివద్దవిడచి తన పనిమీద వెళ్ళిపోయాడు వెంకాయ్. అపరిచితులగు ఆ స్త్రీ పురుషులు దీనమైన ముఖాలతో వినయ పూర్వకముగా నమస్కరించారు. వారిని కూర్చుండ నియమించి వచ్చిన కారణం వినకుతూహాలుడై ప్రశ్నార్థంగా చూచాడు సుదర్శనం.

"బాబూ మేము మిక్కిలి పరాధీనస్థితిలో నున్నాము. భోజనముచేసి నాలుగు రోజులైనది. ఆకలితో మలమల మాడి పోతున్నాం—మీకీర్తి విని చూడ చుట్టము మ్రొక్క దైవము మాకీ సమయమున మీరే" అని నమస్కరించి "కాశీతీర్థమున కేగివచ్చుచుండు దారిలో నా తల్లి గతించినది. భర్తచే విడువబడి అయిదు సంవత్సరాల నుండి నా దగ్గరే తలదాచుకొనుచున్న దీనిస్సహాయ నా సోదరి" అని తన వెనుక మోమువాల్చి నిలుచున్న రాధను చూపెను. వారి కష్టదశను విని సుదర్శనం దయార్ద్ర హృదయుడై "సరే కొన్నాళ్లు మా ఇంట్లోవుండండి ఆపైన భగవదాజ్ఞ" అని అభయమిచ్చాడు.

* * *

సుదర్శనం రాజపురానికి కరణం. చాల తెలివైనవాడు పిత్రార్జిత ధనంతో లేదన్నవారికి సహాయపడుతూ ఒడుదుడుకులులేని జీవితాన్ని గడుపుతున్నాడు. భార్య, తల్లి, తనూ ముగ్గురే వారి కుటుంబ వ్యక్తులు. సుదర్శనం భార్య సుశీల, సద్గుణవతి. భారతనారీ జనసౌశీల్య మామెలో మూర్తీభవించి యున్నది. అత్తగారియందు భయ భక్తులుకలిగి భర్త ఆజ్ఞానువర్తినియై విచారభారములేక సంతోషాన్వితయైవుండేది. కార్యదక్షుడగు సుదర్శనమంటే ఆవూరి ప్రజలంతా వినయ విధేయతలు కలిగి అతనిమాట కెదురు చెప్పేవారుకారు.

* * *

కాలచక్రం గిఱ్ఱున వారాలు, నెలలు, సంవత్సరం తిప్పి వేసింది. కూటికి గుడ్డకు కరువై మార్గస్థులై వచ్చిన రాధా శ్యామలరావులు సుదర్శనం గృహంలో వారొసగిన ఆలన పాలనకు మిక్కిలి సంతృప్తులయ్యారు. పనిపాట్లులేక కుడిచి కూర్చొనుటయే పనిగల శ్యామలునకు లోలోన సిగ్గు కలుగుతూండేది. సుదర్శనరావు అతని అభిప్రాయమెరిగి ఒకవణిక్ ప్రముఖునివద్ద గుమస్తాగా 'కుంభకోణం'లో జేర్పించి సాగనంపేడు. తనకు ధనబలము బాగా కలిగేవరకు రాధను సుదర్శనరావుగారింటనే సుశీలాదేవికి గృహకృత్యాల్లో సాయం చేయుచు తలదాచుకునేందుకు రాజపురంలోనే వదలి వెళ్లిపోయాడు. రాధ సుశీలకు చేదోడు వాదోడై అన్ని కార్య కృత్యాల్లోను సహాయంచేస్తూ తన వినయవిధేయతలచే అమాయికయగు ఆ గృహిణిని మెప్పించి నమ్మకస్తురాలైంది. సుశీల క్రమంగా గృహ కార్యాలుకూడ చక్కబెట్టుటకు రాధనే కోరేది. కాలక్రమాన రాధ ఆ గృహవ్యవహారాల్లో చనువు, స్వాతంత్ర్యత పొందింది. సుదర్శనానికికూడ ఆమెపై ఒక విధమైన అభిమానమేర్పడింది. అనాధయగు తనకాశ్రయ మిచ్చి కాపాడుచున్న సుశీలా సుదర్శనులకు తన సపర్య సేవలతో కృతజ్ఞత వ్యక్తపరచేది రాధ. క్రమంగా సుశీల కొంగున కట్టుబడియుండే తాళపు చెవులగుత్తి రాధ కొంగున అమర్చబడింది.

* * *

రాధ వినయ విధేయతలను, అద్వితీయమైన ఆమె గృహ నిర్వహణా నైపుణ్యాన్నిచూచి సుదర్శన్ చాల సంతోషించాడు. ఆమెపై నానాటికి అతని హృదయంలో ప్రేమ బీజాలు నాటుకున్నాయి. అమాయికయగు సుశీలకీ సంగతి తెలియదు. పురాణపఠనం, దైవపితృ తర్పణాలు ఉపవాస

వ్రతములు తప్ప యితర విషయ వ్యాసంగం ఆమెకు లేదు. సుదర్శన్ కేవలం శృంగార పురుషుడు, వ్రతోపవాసాల పేర్లువింటే విసుగుకొనేవాడు.భయభక్తులు కలవాడగుటవలన తన విసుగును బహిర్గత మొనర్చే వాడుకాడు. ఉపవాసాలతో కృశిస్తూన్న సుశీలను చూచే కన్నులతో నవయవ్వనముతో ప్రకాశిస్తున్న రాధ రూపసిరిని చూస్తూంటే అతను ఏదో తీరని కోర్కెలతో బాధపడుతూండే వాడు. రాధను లోబరచుకొనే ప్రయత్నాలు చేస్తూండేవాడు. తుదకు రాధ వంచితయైనది. రాధా సుదర్శనుల చెలిమి ఇంటా, బయటా గుసగుసలు పెనవేశాయి. ఒక్కొక్క సమయాన సుదర్శనాన్ని రాధ మందలించేది, తమ ప్రేమ లోకవిరుద్ధమని. ఏదో పుక్కిటి పురాణ గాథలను జెప్పి ఆమెను ఓదార్చెడువాడు సుదర్శనుడు. "పాపానికైనా జడియరా" అనేది రాధ పాపభీతి నాకుకలదు కాని నాచర్య నా పంచాంగంలో పాపభూయిష్టమని వ్రాయబడలేదు. ఈ ప్రపంచమంతా ప్రేమ పాలితం, ప్రేమమయం... యింకేం సందేహం నీకు? అనే వాడు సుదర్శన్. రాధ పూర్తిగ సుదర్శనానికి వశమై పోయింది.

* * *

సుశీలకు తనస్థానం తల్లక్రిందులైందని బోధపడింది. పతిని యెదురాడే శక్తి ఆమెకు లేదు. "సతికి పతియే దైవం! పతియే నిరసించిన సతిగతి ఏమికావాలి? పతి నిరసించిన సతి జీవితము బ్రతుకుచేటు గదా!" అని సుశీల ఏకాంతంగా విలపిస్తూ "ఓరిమి కనకతుల్య"మని ఒక "విధమైన అమృతత్వమందిమిడియున్నద"ని మా అమ్మ చెప్పుతుండేది నేనలా ఓర్పుతో సహన శక్తిని పురికొల్పి పతియొక్క నిర్దయా సుహారాన్ని తాలిమి అనే ఆతపకాంతిచే పటాపంచ లొనరించడమే నాకిక త్రోవ. పరమేశ్వరా నీవేశరణ్యం," అని ప్రార్థించేది.

సుదర్శనం ప్రవర్తన యిప్పుడు పూర్తిగమారి పోయింది. ఇల్లూ వాకిలీ అనక అహర్నిశలు ప్రేమోపవిహారాల్లో ఆస్థి దుర్వ్యయమై చెదరిపోయింది. ప్రజలకు అభిమానం నశించింది. అప్పులవాళ్లు సుశీలను శ్రమపెడుతూండేవారు. సుశీలకేమీ తోచడంలేదు. వృద్ధాప్యముతో రోగగ్రస్తయగు అత్తగారి పాదాలపై విషణ్ణ వదనంతోపడి ఘోషించేది. పుత్రుని దుదుష్ప్రవర్తన విన్నకొద్దీ ఆమె మనోవ్యాధి అస్వస్థ హృదయంలో అగ్నిగోళాలు బ్రద్దలైనట్లుండేది. సుష్కించిన హస్తాలతో సుశీలను హృదయానికి హత్తుకొని "విచారించకు తల్లీ, ఏనాటికైనా నీభర్తలో పరివర్తన కలుగక మానదు. యింతకన్నా ఏం చెప్పేది నీకు! విజ్ఞానవతివి నీకు తెలియనిదేమున్నది! అంతా పరమేశ్వరుని ఆజ్ఞ. నా మరణమా సన్నమవుతున్నది. కుమారుడవైనా కుమార్తెవైనా నీవే తల్లీ! నా పట్టెడి దేహాన్ని పిడికెడు బుగ్గిచేసి వ్యథతో వీడిన నా ఆత్మకు శాంతిచేకూర్చు" అనేది అత్తగారు. ఈ మాటలు వింటూన్న సుశీల కన్నీరు మున్నీరై పోయేది. అత్తగారి అంత్యావస్థ అనేమాట తలంపు కలిగితే తుఫాను మధ్య ఓడవలె తన స్థితినితలచి గడగడ వణకేది. తలిదండ్రుల కరువైన తన జీవితానికి ఆశ యెక్కడిది? ఆమె స్థితి నానాటికి దుర్భరమైపోవుచున్నది. దిన దినం శరీరం కృశించి పోవుచున్నది శిరోజాలు సంస్కారహీనమై జడలుకట్టి పోతున్నవి. అత్తగారి పరిచర్యలో నిద్రాహారాలు విసర్జించి ఆమె అంత్యదశలో విచారముతో మునిగియుండేది.

* * *

కలకత్తాలో దుర్గామహోత్సవాలు చూచుటకు రాధా సుదర్శనులు ప్రయాణ సన్నాహములో నున్నారు. తల్లి దశమావస్థలో వున్నది. ఇంటిలో యిట్టి విషమావస్థ ఆవిర్భవించడం, పతి కలకత్తా ప్రయాణ సన్నాహం, చూచి సుశీల దీన వదనముతో భర్త పాదములపైబడి ప్రయాణ మాపమని ప్రార్థించెను. "ప్రయాణపువేళ నాకు బుద్ధులు గరపచూపుచున్నావా"యని పాదముల నంటియున్న సుశీలను పదాఘాతముచే త్రోసివేయ ఆమె అశక్తయై గజము దూరమున తుళ్లిపడి పోయినది. ప్రయాణాహ్లాదయైయున్న రాధ వచ్చి "పతికి సతిపై యెంతటి కారుణ్యం"అని పరిహసించి హాసోన్ముఖియై బండివైపుకు నడచింది.

* * *

సుశీల అత్తగారు తనువుచాలించింది. శేషించినచేయూత కూడ నాటితో సుశీలకు చేజారిపోయింది. కలకత్తాకువెళ్లిన భర్త తిరిగి రాలేదు. సంవత్సరాలు గడిచి పోయినవి. అతని జాడలేదు ఆస్తిపాస్తుల నమ్మి ఋణముల తీర్చివేసి ఏకాంత

వాసియగు జీవనానికి సన్యాసాశ్రమం, తాపసజీవనం, ముక్తి పదమని నమ్మి మోక్షగామినియై విశ్వేశ్వరుని సేవింప కాశీ క్షేత్రమునకు బయలుదేరినది.

*　*　*

అది కార్తికమాసం. విశ్వేశ్వరుని దర్శనార్థమై జనుల రాకపోకలచే క్రిక్కిరిసియుండెను. జడలుకట్టిన కేశకలాపంతో, కంఠాన ధరించిన రుద్రాక్షమాలలతో ఒడలంత విభూతి కాంతులతో, తపస్వినియగు సుశీల స్వరూపము ఆ మహాజనరాశిలో గంపెడు రాళ్ళలో రత్నమువలె వెలుగుచుండెను. ఒక చేతిలో జపమాల యింకో చేతిలో పావన నదీ తోయాలు నిండిన పాత్ర పుష్పమాలలు మొదలైన పూజాద్రవ్యములతో పంచాక్షరీ మంత్రమును జపించుకొంటూ మూర్తీభవించిన భక్త్యావేశము ముఖముపై లాస్యమాడ ముందున్న వారు తమకు తామె తప్పుకొనగా సుశీల గర్భాలయములో ప్రవేశించి "నిరతము నిన్నే నమ్మియుంటిరా నీలకంఠ వరదా— అనాథలగు నాబోటి యువిదల కాశ్రయ మియ్యవె మదన హరా" అని ప్రణమిల్లి పుష్పమాలలతో నర్చించి, శ్రీ విశాలాక్షిని దర్శించి మిట్ట మధ్యాహ్నమైన వెనుక ఆభవునిగుడి వదలి నిజాశ్రమానికి జేరి ప్రసాదము స్వీకరింప బోవుచుండ, "భజగోవిందం, భజగోవిందం గోవిందం భజ మూఢమతే" అనుశ్లోకం పాడుచూ అంధుడైన ఒక కాషాయ వస్త్రధారి కట్టుసహాయంతో ఆశ్రమానికి జేరి పట్టెడన్నము పెట్టుడని యర్థించెను. సన్యాసి రోదనంవిని జాలిపడి భుజించ బోయే ఫలహారమును కొంతయిచ్చుటకై వచ్చిన సుశీలకు అంధ సన్యాసివదనం సుపరిచితమైనదిగ కనుపింప నిశ్చేష్టయైనది. గాని అతడేనా ?...అవునా...కాదా!...ఆలోచించుచున్న సుశీలకు... వేదనాభరంతో ఆ భిక్షుకసన్యాసి...

పన్నితి మాయోపాయములన్
పెట్టితి పతివ్రతను పలుబాములు
దేవా మోక్షమిక గలదె
నాకీ జగాన !

లొంగిపోతిని నీదు శిక్షాస్మృతికి
ఆరగించితి నాదుపాప ఫలముల
దేవా మోక్షమిక గలదె
నాకీ జగాన !

కటిక చీకటిలోన నెత్తొత్తి ఏడ్వనా
వాగులై ప్రవహించు పరితాపాశ్రులు
కదలింపవో నీదు పాషాణ హృదయమునను
నాబోటి వానికీ జగాన
మోక్షమికగలదె నాకీజగాన !

ఈ చీకటుల్ చెదటి కాంతులు క్రమ్మునా
ఏనెప్పటికైన వీక్షింతు నాచెలిని
దేవా మోక్షమిక గలదే-
నాకీజగాన !

అమృతవానలలో-గగనకాంతులలోన
విమలచరితలలోన-వికసించు నా సుశీల
దేవా మోక్షమికగలదె
నాకీ జగాన !

అని పాడుచు హృదయాగ్ని ప్రజ్వరిల్ల "నా ప్రాణములు గైకొమ్ము సుశీలా...శిక్షింపు మ"నుచు అరుగుపై తలను బాదుకొనుచుండ దిగ్భ్రాంతయై నిలుచున్న సుశీల సన్యాసి తన నామమె పలుసారులు పలుకుచుండుట, తన నాథుని పరిచయ కంఠం విని, "నాథా...సుశీల సర్వకాలములయందు మీ పదదాసియే! మన్నింపుడు సన్యాసి వేషమున మిమ్ము గుర్తింపలేక పోయితి" ననుచు పతిపాదములపై వ్రాలెను.

సన్యాసి ఆనందమునకు మేరలేదు. "నా సుశీల ... నా కాశ్రయ మిచ్చినదా? నిజమా! పరమేశ్వరా! నా సుశీల దరికి నన్ను జేర్చితివా?" యనుచు దిగ్భ్రమతో ఆనందాశ్రులు రాల్చెను—